


# వేదన

**మూలవాక్యము:-**

**లూకా 22:44** ఆయన వేదనపడి మరింత ఆతురముగా ప్రార్థన చేయగా ఆయన చెమట, నేల పడుచున్న గొప్ప రక్త బిందువుల వలె ఆయెను.

**ప్రవచనము - యెష 53:11** అతడు తనకు కలిగిన వేదనను చూచి తృప్తినొందును. నీతిమంతుడైన నా సేవకుడు జనులదోషములను భరించి తనకున్న అనుభవ జ్ఞానము చేత అనేకులను నిర్దోషులుగా చేయును.

పై రెండు లేఖన భాగములు యేసయ్య సిలువకు ముందు మరియు సిలువలో వేదన అనుభవించినట్లు అర్థమౌతుంది. అసలు వేదనలు ఎవరికి కలుగుతాయి.

యేసయ్య ఎందుకు వేదన అనుభవించారో లేఖనాలలో పరిశీలిద్దాం.

**వేదనలు ఎవరికి కలుగుతాయి:-**

**భక్తిహీనులకు వేదనలు కలుగును:**

**కీర్త 32:10** భక్తిహీనులకు అనేక వేదనలు కలుగుచున్నవి. యెహోవా యందు నమ్మికయుంచు వానిని కృప ఆవరించుచున్నది.

**దుష్కార్యము చేయువారికి వేదనలు కలుగును:**

**రోమా 2:9** దుష్కార్యము చేయు ప్రతి మనుష్యుని ఆత్మకు, మొదట యూదునికి గ్రీసు దేశస్థునికి కూడ శ్రమయు వేదనయు కలుగును.

భక్తిహీనులకు, దుష్కార్యము చేయు వారికి వేదనలు కలుగుతాయని వాక్యము చెబుతుంది. యేసయ్య భక్తిహీనుడు కాదు యేసయ్య ఏ దుష్కార్యము చేయలేదు. **( లూకా 23:22) మరి ఎందుకు యేసయ్య వేదన పడ్డాడు.** ఇక్కడ ఒక్క విషయం మనము అర్థం చేసుకోవాలి. యేసయ్య ఈ లోకానికి ఎందుకు వచ్చారో మనం గుర్తించాలి.

యేసయ్య పరిశుద్ధుడు - పాపులను రక్షించి పరిశుద్ధులుగా చేయుటకు వచ్చారు.

యేసయ్య ధనవంతుడు - దరిద్రులను ధనవంతులుగా చేయుటకు వచ్చారు.

యేసయ్య మన దోష శిక్ష తన మీద వేసుకున్నాడు - దోషులను నిర్దోషులుగా మార్చారు.

యేసయ్య మన రోగములు భరించారు - మనకు స్వస్థత ఇవ్వడం కొరకు

యేసయ్య మన వ్యసనములను వహించారు - మనకు విడుదల ఇవ్వడము కొరకు

అలాగే మానవ జీవితాల్లో ఉన్న పలు రకాల వేదనలు తొలగించుట కొరకు ఆయన వేదన అనుభవించారని మనకు అర్థమౌతుంది.

**మానవాళి అనుభవిస్తున్న పలురకాల వేదనలను వాక్యములో గమనిద్దాం:-**

**1. గర్భ వేదన:- దేవుడు పాపము చేసిన హవ్వకు వేసిన శిక్ష:**

**ఆది 3:16** ఆయన స్త్రీతో నీ ప్రయాసమును నీ గర్భవేదనను నేను మిక్కిలి హెచ్చించెదను;వేదనతో పిల్లలను కందువు; నీ భర్త యెడల నీకు వాంఛ కలుగును; అతడు నిన్ను ఏలునని చెప్పెను.

**2. ప్రసూతి వేదన - ప్రసవ వేదన :- (శరీర సంబంధమైన) :-**

1దిన 4:9,10 యబ్బేజు తన సహోదరుల కంటె ఘనము పొందిన వాడై యుండెను. వేదనపడి యితని కంటినని అతని తల్లి అతనికి యబ్బేజు అని పేరు పెట్టెను. యబ్బేజు ఇశ్రాయేలీయుల దేవుని గూర్చి మొఱ్ఱపెట్టి నీవు నన్ను నిశ్చయముగా ఆశీర్వదించి నా సరిహద్దును విశాలపరచి నీ చెయ్యి నాకు తోడుగా ఉండదయచేసి నాకు కీడు రాకుండ దానిలో నుండి నన్ను తప్పించుము అని ప్రార్థింపగా దేవుడు అతడు మనవి చేసిన దానిని అతనికి దయచేసెను.

**మీకా 4:9** నీవెందుకు కేకలు వేయుచున్నావు? నీకు రాజు లేకపోవుట చేతనే నీ ఆలోచనకర్తలు నశించిపోవుట చేతనే ప్రసూతి స్త్రీకి వచ్చిన వేదనలు నీకు వచ్చినవా?

**1 థెస్స 5:3** లోకులు నెమ్మదిగా ఉన్నది, భయమేమియు లేదని చెప్పుకొనుచుండగా, గర్భిణి స్త్రీకి ప్రసవ వేదన వచ్చునట్లు వారికి ఆకస్మికముగా నాశనము తటస్థించును. గనుక వారెంత మాత్రమును తప్పించుకొనలేరు.

**ప్రసవ వేదన :- (ఆత్మ సంబంధమైన) :-**

**గలతీ 4:19** నా పిల్లలారా, క్రీస్తు స్వరూపము మీయందేర్పడు వరకు మీ విషయమై మరల నాకు ప్రసవ వేదన కలుగుచున్నది.

క్రైస్తవ జీవితం నామకార్థం కాదు. మనము ఏ క్రీస్తు స్వరూపాన్ని ఏదేను తోటలో పోగొట్టుకున్నామో, అది తిరిగి పొందుకోవాలి అని పౌలు గలతీ సంఘానికి వ్రాశారు.

**3. మనో వేదన:- కోడళ్లతో మనోవేదన:**

**ఆది 26:34,35** ఏశావు నలువది సంవత్సరముల వాడైనప్పుడు హిత్తీయుడైన బేయేరీ కుమార్తెయగు యహూదీతును హిత్తీయుడైన ఏలోను కుమార్తెయగు బాశెమతును పెండ్లి చేసికొనెను. వీరు ఇస్సాకునకును రిబ్కాకును మనోవేదన కలుగజేసిరి.

**నాటి నుండి నేటి వరకు కోడండ్రతో ఇబ్బంది పడేవారు, అత్త మామలతో, ఆడబిడ్డలు మరుదులతో వేదన పడేవారు వున్నారు.**

**ద్వితీ 2:25** నేడు నేను నీవలని భయము నీవలని వెరపు ఆకాశము క్రిందనున్న సమస్త దేశముల వారికిని పుట్టింప మొదలు పెట్టుచున్నాను. వారు నిన్ను గూర్చిన సమాచారము విని నీ యెదుట వణకి మనోవేదన

నొందుదురు.

**4. హృదయ వేదన:-**

**కీర్త 25:17** నా హృదయ వేదనలు అతి విస్తారములు ఇక్కట్టులో నుండి నన్ను విడిపింపుము.

**5. మానని వేదన:- సంఘమును గూర్చి పౌలు ఈలాగు వ్రాశారు.**

**రోమా 9:1** నాకు బహు దుఃఖమును, నా హృదయములో మానని వేదనయు కలవు.

**6. మహా వేదన :-**

ఆది : 12:17 – అయితే యెహూవా అబ్రాము భార్యయయిన శారయిని బట్టి ఫరోను అతని యింటివారిని మహావేదనలచేత బాధించెను.

**7. దుస్సహమైన వేదన(ప్రస్తుతకాలంలో ప్రపంచంలో ఎక్కడ చూసిన ఇదే వేదన):**

యెషయా 8:22 – భూమి తట్టు తేరి చూడగా బాధలును అంధకారమును దుస్సహమైన వేదనయు కలుగును: వారు గాఢాంధకారములోనికి తోలివేయబడెదరు.

పైన చెప్పబడినవి మాత్రమే కాకుండా అనేక రకములైన వేదనపూరిత జీవితాల్లో ఉన్న మానవాళిని విముక్తి కలిగించడం కొరకు యేసయ్య సిలువలో వేదన అనుభవించారు.

యేసు క్రీస్తు ఈ లోకములోనికి రావడానికి ముఖ్య కారణం.

1. మన బదులు వేదన అనుభవించడానికి
2. వేదన లేని పరలోకానికి మనలను తీసుకు వెళ్లడానికి.

**యేసయ్య సేవా జీవితంలో వేదనలో ఉన్న వారికి విడుదలనిచ్చారు:-**

**మత్త 4:24** ఆయన కీర్తి సిరియ దేశమంతట వ్యాపించెను. నానావిధములైన రోగముల చేతను వేదనల చేతను పీడింపబడిన వ్యాధిగ్రస్తులనందరిని, దయ్యము పట్టిన వారిని, చాంద్రరోగులను, పక్షవాయువు గల వారిని వారు ఆయన యొద్దకు తీసికొని రాగా ఆయన వారిని స్వస్థపరచెను.

**యేసయ్య రెండవ రాకడకు వేదనలు ఒక సూచనగా ఉన్నాయి:-**

**మత్త 24:8** అక్కడక్కడ కరువులును భూకంపములును కలుగును; ఇవన్నియు వేదనలకు ప్రారంభము.

**పరలోక రాజ్యములో ఇక ఎన్నడు వేదన ఉండదు:-**

**ప్రక 21:4** ఆయన వారి కన్నుల ప్రతి బాష్ప బిందువును తుడిచివేయును,
మరణము ఇక ఉండదు, దుఃఖమైనను, ఏడ్పైనను, వేదనయైనను ఇక ఉండదు. మొదటి సంగతులు గతించిపోయెనని సింహాసనములో నుండి వచ్చిన గొప్ప స్వరము చెప్పుట వింటిని.

**నరకము వేదనకరమైన స్థలము:-**

**లూకా 16:28** వారును ఈ వేదనకరమైన స్థలమునకు రాకుండ వారికి సాక్ష్యమిచ్చుటకై నా తండ్రి యింటికి వాని పంపవలెనని నిన్ను వేడుకొనుచున్నాననెను.

మరణించి పరదైసులో అబ్రాహాము రొమ్మున ఆనుకొని ఉన్న లాజరును, నరకం నుంచి చూచిన ధనవంతుడు, మొదట ఒక్క చుక్క నీళ్లు అడిగి జవాబు పొందుకోలేక తన కుటుంబీకులు ఈ వేదన కరమైన స్థలానికి రాకుండునట్లు వారికి సువార్త ప్రకటించటానికి లాజరును పంపమని వేడుకున్నాడు. ఆ ధనవంతుని యింటి వాకిట లాజరు అను దరిద్రుడు అతని బల్ల మీద నుండి పడు రొట్టె ముక్కలతో ఆకలి తీర్చుకుంటు ఉండేవాడు. ఆ దరిద్రుడు చనిపోయి దేవదూతల చేత అబ్రాహాము రొమ్మున ఆనుకొనుటకు కొనిపోబడెను. ధనవంతుడు కూడా చనిపోయి పాతాళములో బాధపడుచు కన్నులెత్తి తండ్రివైన అబ్రాహామా, నా యందు కనికరపడి అతని వ్రేలికొనను నీళ్లలో ముంచి నా నాలుకను చల్లార్చుటకు లాజరును పంపమని కేకలు వేసి చెప్పెను. అందుకు అబ్రాహాము నీవు జీవితకాలమంత సుఖము అనుభవించితివి. లాజరు కష్టము అనుభవించెను. ఇప్పుడైతే వాడు ఇక్కడ నెమ్మది పొందుచున్నాడు, నీవు యాతనపడుచున్నావు. అంతేకాక అక్కడి వారు ఇక్కడికి ఇక్కడి వారు అక్కడికి రాకూడదు. మాకును మీకును మధ్య మహా అగాధ ముంచబడియున్నదని చెప్పెను(లూకా 16:24-26).

**ముగింపు:-**

యేసయ్య మన వేదనలను అనుభవించాలంటే, ఆయన అవి తన పైన వేసుకొని, మరెన్నడు మనం అవి అనుభవించకుండ ఒకే సారి భరించాలి.

గెత్సెమనె తోటలో యేసుక్రీస్తు వేదనను అనుభవించుట: లూకా 22:44 - ఆయన వేదనపడి మరింత ఆతురముగా ప్రార్థన చేయగా ఆయన చెమట, నేల పడుచున్న గొప్ప రక్త బిందువుల ఆయెను.

**1. విభ్రాంతి చెందుటకు చింతాక్రాంతుడగుటకును ఆరంభించెను:**

మార్కు 14:33 - పేతురును యాకోబును యోహానును వెంటబెట్టుకొనిపోయి, మిగుల విభ్రాంతి నొందుటకును చింతాక్రాంతుడగుటకును ఆరంభించెను.

**2.నా ప్రాణము ఎంతో దు:ఖములో వుంది:**

మార్కు 14:34 - అప్పుడాయన- నా ప్రాణము మరణమగునంతగా దు:ఖములో మునిగియున్నది మీరిక్కడ వుండి మెలకువగా నుండుడని వారితో చెప్పి.

**3. ఆయన ప్రార్థించుచుండగా రక్త బిందువులు ఆయన చర్మము గుండా బయటికి వచ్చాయి:**

లూకా 22:44 - ఆయన వేదనపడి మరింత ఆతురముగా ప్రార్థన చేయగా ఆయన చెమట, నేలపడుచున్న గొప్ప రక్త బిందువుల ఆయెను.

**4. దేవదూత వచ్చి ఆయనను బలపరచవలసి వచ్చింది:**

లూకా 22:43 - అప్పుడు పరలోకమునుండి యొక దూత ఆయనకు కనబడి ఆయనను బలపరచెను.

పై వాక్యాలు ఆయన ఎంత వేదన పడ్డాడో తెలుపుతుంది అందుకే ఇప్పుడు ఏ ప్రసూతి వేదన లేదు చక్కగా హాస్పిటల్‌కి వెళ్లి సిజేరియన్ చేసుకొని వస్తున్నారు. బాధ, వేదన సాకుచూపి మందు తాగుతున్నారు. డ్రగ్స్ వాడుతున్నారు పిల్లలు కనడం మానేశారు.

అద్దెగర్భాలు పెంచారు కాని .......... మారుమనస్సు నొందకున్నారు. యేసుక్రీస్తు మన పాత రోత జీవితము మారి పాపులు పరిశుద్ధులుగా మారటం కోసం ఆ ఘోర శ్రమ, వేదనను అనుభవిస్తే మనము లెక్క లేని తనముగా బ్రతుకుతున్నాము.

**కనీసం ఇప్పుడైన మారదాం.**

కోతకాలము గతించియున్నది, గ్రీష్మ కాలము జరిగిపోయెను, మనము రక్షణనొందకయే యున్నాము అని చెప్పుదురు .

యేసయ్య సిలువ మరణము వేదనాపూరితమైన మన జీవితాలను మార్చి వేస్తుంది. ఈ లోకములో మనలోని వేదనలను తొలగించడము మాత్రమే గాక వేదన లేని స్థలమైన పరలోకరాజ్యములోనికి మనలను తీసుకొని వెళ్తుంది. యేసయ్యను విశ్వసించని వారికి నరకము, అగ్నిగుండము అనే మానని వేదన గల స్థలము సిద్ధపరచబడింది. ఈ వాక్యము ధ్యానిస్తున్న నీకు ఏమి కావాలి?

వేదన లేని స్థలములో స్థానమా?

వేదనాభరితమైన స్థలములో స్థానమా?

పరిశీలించుకొని, పరీక్షించుకొని ఒక మంచి నిర్ణయం తీసుకుంటారని ఆశిస్తున్నాము.

మన ప్రభువైన యేసు క్రీస్తు కృప మీ ఆత్మలకు తోడైయుండును గాక....ఆమెన్